


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 25.05.2026 | సంపుటి: 3 | సంచిక: 113 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | MONDAY | 25.05.2026 | VOLUME : 3 | ISSUE : 113 | PAGES: 8 | COST: 2/-

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

## గ్రామీణ మహిళలకు సొంత వేదిక

- 8 వేల మహిళా భవనాల నిర్మాణానికి సీఎం రేవంత్ శ్రీకారం
- స్వయం సహాయక సంఘాల బలోపేతానికి భారీ ముందడుగు

**హైదరాబాద్, మే 24(రాజముద్ర న్యూస్):** మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేసి, గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ఊతమివ్వాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణ పనులకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.
గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలకు సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, సామాజిక

మిగతా 2వ పేజీలో..



## జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా అమలు

- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల ఉచిత బీమా
- సంక్షేమ భద్రతకు కాంగ్రెస్ ప్రభుత్వ కొత్త అడుగు
- మహిళా సంఘాలకు రూ.1 లక్ష కోట్ల వడ్డీలేని రుణాల లక్ష్యం

**హైదరాబాద్, మే 24 (రాజముద్ర న్యూస్)** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'ఇందిరమ్మ బీమా' పథకాన్ని ప్రారంభించనుంది. రాష్ట్రంలోని సుమారు 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల ఉచిత బీమా రక్షణ కల్పించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి

మిగతా 2వ పేజీలో..



## అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందవద్దు

- తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- తాలు, తరుగు పేరుతో కోతలు పెడితే చర్యలు తప్పవు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2



## ఉచిత విద్యుత్ రద్దుకే వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

- కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఫైర్
- వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం కుట్రేనన్న కేటీఆర్
- ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయడానికే ఈ నిర్ణయమని ఆరోపణ
- మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రీపెయిడ్ మీటర్లు పెడతారని వ్యాఖ్య
- గతంలో కేసీఆర్ ఒప్పుకోని పనిని కాంగ్రెస్ చేస్తోందని విమర్శ

2



# టార్గెట్ టీపీసీసీ చీఫ్



- కాంగ్రెస్‌లో కొత్త కలకలం
- గ్రూపు రాజకీయాలు మళ్లీ తెరపైకి వచ్చాయా?
- మహేష్ కుమార్ గౌడ్‌పై ఓ మీడియాలో వ్యతిరేక కథనాలు
- అనుకూల మీడియా వైఖరిపై నేతల్లో అనుమానాలు
- రేవంత్‌మహేష్ మధ్య దూరం పెరిగిందనే ప్రచారం

**హైదరాబాద్, మే 24 (రాజముద్ర న్యూస్)** తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌పై ఓ ప్రముఖ టెలివిజన్ ఛానెల్‌లో వరుసగా ప్రసారమవుతున్న ప్రతికూల కథనాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా ప్రభుత్వానికి అనుకూల ధోరణి ప్రదర్శిస్తుందనే విమర్శలు ఎదుర్కొనే ఆ ఛానెల్ ఒక్కసారిగా టీపీసీసీ అధ్యక్షుడినే లక్ష్యంగా చేసుకోవడం వెనుక రాజకీయ కారణాలున్నాయనే అభిప్రాయాలు కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలు పార్టీ అంతర్గత విభేదాలను మరోసారి వెలుగులోకి తెచ్చినట్లయ్యాయి.
మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ పలు ఎన్నికల్లో




విజయాలు నమోదు చేసింది. ఇటీవల సర్పంచ్ ఎన్నికల్లో గణనీయమైన స్థానాలు గెలుచుకోవడంతో పాటు నిజామాబాద్ జిల్లాలో మున్సిపాలిటీలను కైవసం చేసుకుంది. జూబ్లీహిల్స్

మిగతా 2వ పేజీలో..




## భారీ దోపిడీ కేసు ఛేదించిన పోలీసులు..

- కిలో బంగారం, వెండి స్వాధీనం..
- ఒకే కుటుంబంలో నలుగురు దొంగలు..

2

## హైదరాబాద్‌లోని నార్సింగి మూవీ టవర్స్ సెల్లార్‌లో భారీ అగ్నిప్రమాదం

3

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు తక్షణమే ఎత్తివేయండి

- ఏపీ ప్రభుత్వానికి హరీశ్ రావు విజ్ఞప్తి
- జగన్ తో స్నేహంగా ఉండాలని పవన్ కు అమిత్ షా చెప్పారన్న ప్రొఫెసర్ నాగేశ్వర్
- ఈ విషయాన్ని పవన్ జనసేన నేతలతో చెప్పారని వెల్లడి
- ప్రొఫెసర్ నాగేశ్వర్ వైసీపీ తొత్తు అంటూ జనసైనికుల మండిపాటు
- పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు.. కేసులు నమోదు

2





## మే 30న క్రమశిక్షణ కమిటీ ముందుకు

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి: మల్లు రవి
- పార్టీ క్యాడర్ అంతా కలిసి పనిచేయాలన్న మల్లు రవి
- ప్రస్తుతం ఎమ్మెల్యే యశస్విని విదేశాల్లో ఉన్నారని వెల్లడి
- ఇరు వర్గాల మధ్య సమస్యలను పరిష్కరిస్తామన్న రవి

2

## మాదాపూర్‌లో అర్ధరాత్రి రేసర్ల హంగామా

- పోలీసులను లెక్కచేయకుండా దూసుకెళ్లిన యువకులు
- వెంటాడి పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

2






## మేడ్చల్‌లో ఉగ్రవాద అనుమానితుడి అరెస్ట్

- సోషల్ మీడియా ద్వారా పాకిస్థాన్ ముఠాతో పరిచయాలు
- డమ్మీ పిస్టళ్లు, మొబైల్ స్వాధీనం

**మేడ్చల్, మే 24 (రాజముద్ర న్యూస్):** అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్నాడనే అనుమానంతో మేడ్చల్‌లో ఓ యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జహీద్ ఖాన్‌ను కౌంటర్ ఇంటెలిజెన్స్ (సీఐ),

మిగతా 2వ పేజీలో..

# మే 30న క్రమశిక్షణ కమిటీ ముందుకు

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రెడ్డి: మల్లు రవి
- పార్టీ క్యాడర్ అంతా కలిసి పనిచేయాలన్న మల్లు రవి
- ప్రస్తుతం ఎమ్మెల్యే యశస్విని విదేశాల్లో ఉన్నారని వెల్లడి
- ఇరు వర్గాల మధ్య సమస్యలను పరిష్కరిస్తామన్న రవి

**పాలకుర్తి/హైదరాబాద్ 24:**

పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో తలెత్తిన అంతర్గత విభేదాల పరిష్కారానికి అధిష్ఠానం రంగంలోకి దిగింది. పార్టీ బలోపేతం కోసం నేతలు, క్యాడర్ అంతా కలిసి పనిచేయాలని ఎంపీ, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిణామాలపై హైదరాబాద్‌లో స్థానిక నేతలతో భేటీ అయిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ వివాదానికి సంబంధించి ఝాన్సీ రెడ్డి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారని, అయితే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉండటం వల్ల రాలేకపోయారని తెలిపారు. ఎమ్మెల్యే తిరిగొచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి మే 30వ తేదీన కమిటీ ముందుకు హాజరు కావాలని సూచించినట్లు మల్లు రవి పేర్కొన్నారు. పాలకుర్తిలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ స్థానిక నేతలు హరిప్రసాద్, కృష్ణ కిషోర్‌లపై ఎమ్మెల్యే వర్గం ఫిర్యాదు చేయగా.. మరోవైపు ఎమ్మెల్యే, ఝాన్సీ రెడ్డిలు క్యాడర్‌ను పట్టించుకోకుండా వేధిస్తున్నారంటూ కౌంటర్ ఫిర్యాదులు అందాయని ఆయన వివరించారు. ఇప్పటికే కిషోర్, హరిప్రసాద్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వగా, వారు ఆధారాలతో సమాధానం ఇచ్చారన్నారు. ఈ సమస్యపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు స్థానిక నేతలతో కలిసి చర్చించి, ఇరు వర్గాల మధ్య సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని మల్లు రవి స్పష్టం చేశారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్ పై కేసులు
# తక్షణమే ఎత్తివేయండి

**హైదరాబాద్, మే24 :**

జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కూటమి ప్రభుత్వంపై ప్రముఖ రాజనీతి విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర రాజకీయ దుమారం రేపిన సంగతి తెలిసిందే. వైసీపీ అధినేత జగన్‌ను అరెస్ట్ చేయాలంటూ పవన్ కల్యాణ్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరినట్టు... జగన్ మనకు లాంగ్ టైమ్ ఫ్రెండ్, ఆయనతో స్నేహంగా ఉండాలని పవన్‌కు అమిత్ షా చెప్పినట్టు ప్రొఫెసర్ నాగేశ్వర్ చేసిన కామెంట్స్‌ను జనసేన పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. ఆయన వైసీపీకి తొత్తుగా మారి అవాస్తవాలు మాట్లాడుతున్నారంటూ సోషల్ మీడియాలో జనసైనికులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించడమే కాకుండా, ఏపీలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు చేయడంతో కేసులు కూడా నమోదయ్యాయి.

ఈ నేపథ్యంలో, తీవ్ర ఒత్తిడి ఎదుర్కొన్న ప్రొఫెసర్ నాగేశ్వర్, తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు బేషరతుగా ప్రకటించారు. అయినప్పటికీ ఆయనపై నమోదైన కేసులను ఏపీ పోలీసులు ఇంకా కొనసాగిస్తుండడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తాజాగా తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు స్పందించారు. ఎక్స్ వేదికగా ఆయన ఏపీ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఒక పోస్ట్ చేశారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ తన వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకున్నట్లు ప్రకటించిన తర్వాత కూడా, కక్షపూరిత ధోరణితో ఆయనపై కేసులు నమోదు చేసి వేధించడం ఎంత మాత్రం సరికాదని హరీశ్ రావు హితవు పలికారు. భావప్రకటనా స్వేచ్ఛను గౌరవించాలని, ప్రొఫెసర్‌పై పెట్టిన అన్ని కేసులను ఏపీ ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు చేసిన ఈ ట్వీట్‌పై ఏపీ ప్రభుత్వం, జనసేన శ్రేణులు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి.

## ఉచిత విద్యుత్ రద్దుకే
# వ్యవసాయ మోటార్లకు మీటర్లు..

**తెలంగాణ బ్యూరో, మే 24 :**

తెలంగాణలో రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేయాలనే ఏకైక ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రీపెయిడ్ మీటర్ల పేరుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కుట్ర పన్నుతోందని ఆయన విమర్శించారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

శనివారం జరిగిన కేబినెట్ సమావేశంలో వ్యవసాయ కనెక్షన్లతో పాటు అన్ని గృహ కనెక్షన్లకూ ప్రీపెయిడ్ మీటర్లు బిగించాలని నిర్ణయం తీసుకున్నారని కేటీఆర్ ఆరోపించారు. రాబోయే మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లలోని పాత మీటర్లను తొలగించి, వాటి స్థానంలో ఈ కొత్త ప్రీపెయిడ్ మీటర్లు ఏర్పాటు చేయాలని చూస్తున్నారని తెలిపారు. గతంలో ప్రధాని మోదీ ఎంత ఒత్తిడి తెచ్చినా, రూ. 30,000 కోట్ల రుణం నిలిపివేసినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ మీటర్లు పెట్టడానికి అంగీకరించలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం మూడు నెలల్లోనే మీటర్లు బిగించాలని నిర్ణయించిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ రద్దు అవుతుందని, మోటార్లకు మీటర్లు వస్తాయని తాము హెచ్చరించిన విషయం ఇప్పుడు నిజమవుతోందని అన్నారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించకముందే, ఇళ్లకు ప్రీపెయిడ్ మీటర్లు రాకముందే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ప్రజలకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అవినీతి, అరాచకాలతో పాలన సాగిస్తోందని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అవకాశం వచ్చినప్పుడు కచ్చితంగా బుద్ధి చెబుతారని ఆయన వ్యాఖ్యానించారు.

# భారీ దోపిడీ కేసు ఛేదించిన పోలీసులు..

**మెదక్, మే24:**

మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం చీలపల్లిలో ఈ నెల 14న జరిగిన భారీ దోపిడీ కేసును జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు ప్రెస్ మీట్ ద్వారా అధికారికంగా వెల్లడించారు. ఈ భారీ చోరీకి పాల్పడింది ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సభ్యులుగా పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి సుమారు ఒక కిలో బంగారు ఆభరణాలు, 1.7 కిలోల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం బిబ్యా నాయక్ తండాకు చెందిన జైరాం నాయక్ (45) జాదవ్ ఈ ముఠాకు ప్రధాన సూత్రధారి. సహచరుడిగా తన బావ ఇప్పు సింగ్ (32) తో కలిసి నేరాలకు పాల్పడేవాడు. దొంగిలించిన బంగారు, వెండి ఆభరణాలను జైరాం తన తల్లి మాలి (80), చెల్లి సాంకి బాయి (28) లకు అప్పగించేవాడు. వారు ఆ సొత్తును గుట్టుచప్పుడు కాకుండా దాచి పెట్టేవారు.

**పోలీసులకు దొరికారిలా..**

ఈ నెల 14న జరిగిన చోరీ కేసు విషయమై అడ్వకేట్‌తో మాట్లాడేందుకు వెళ్తుండగా.. రామాయంపేట్ వద్ద జైరాం నాయక్‌ను పోలీసులు వ్యూహాత్మకంగా పట్టుకున్నారు. ప్రస్తుతం ప్రధాన నిందితుడు జైరాం జాదవ్, అతని తల్లి మాలి బాయిని పోలీసులు అరెస్ట్ చేయగా.. జైరాం బావ ఇప్పు సింగ్, చెల్లె సాంకి బాయి ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పట్టుబడిన ఈ కిలాడీ ముఠాపై మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కలిపి మొత్తం 17 దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు ఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందవద్దు

**హైదరాబాద్, మే24:**

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను పౌర సరఫరాలు, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్లపై ఆదివారం హైదరాబాద్‌లో సహచర మంత్రులు, ఉన్నతాధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. రైతులకు చెల్లింపుల పురోగతిపై ప్రత్యేకంగా చర్చించారు.

తాలు, తరుగు పేరుతో కోతలు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతుకు నష్టం చేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించదన్నారు. కాంటా కోసం వేచి ఉన్న 8.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని స్పష్టం చేశారు. అకాల వర్షాలతో ఆందోళన చెందవద్దని.. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయకుంటే.. మిల్లర్లు, కొనుగోలు సిబ్బందిపై కఠిన చర్యల తప్పవని హెచ్చరించారు.

రైతుల్లో గందరగోళం సృష్టించవద్దంటూ అధికారులను మంత్రి ఉత్తమ్ ఆదేశించారు. ఖరీఫ్, రబీ కలిపి రైతులకు రూ.45 వేల కోట్లు చెల్లింపులు చేశామన్నారు. రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని గణాంకాలతో సహా ఆయన వివరించారు. ఈసారి మొత్తం 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం నిర్దేశించుకుందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.8,749 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. రాష్ట్రంలో 21 కోట్ల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గన్నీ బ్యాగుల కొరత అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. హమాలీల కొరతతో కొంత జాప్యం జరిగిందన్నారు. రబీ సీజన్‌లో రికార్డు స్థాయిలో 141 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి జరిగిందని వివరించారు. కేంద్రం కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నులే కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు. మిగిలిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల పనితీరుపై జిల్లా వారీగా సమీక్షించారు. ధాన్యం రవాణా, గోదాముల నిల్వ సామర్థ్యంపై కూడా ఆయన సమీక్షించారు. మహిళా సంక్షేమ కార్యక్రమాల కార్యాచరణపై కూడా ఈ సందర్భంగా చర్చించారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక అమలుపై సమన్వయంతో కలిసి పని చేయాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహ పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు

# మేడ్చల్‌లో ఉగ్రవాద అనుమానితుడి అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

మేడ్చల్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రెండు డమ్మీ పిస్టళ్లు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన జహీద్ ఖాన్ కొన్నేళ్ల క్రితం తన స్నేహితుడు ఫైజల్ ద్వారా ఉపాధి కోసం మేడ్చల్‌కు వచ్చాడు. స్థానికంగా ఓ హోటల్‌లో కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే సమయంలో సోషల్ మీడియాలో, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ రూపొందించడం అతనికి అలవాటుగా మారింది. బొమ్మ తుపాకులను ప్రదర్శిస్తూ రూపొందించిన కొన్ని వీడియోలను అతడు సోషల్ మీడియాలో పోస్టు చేయగా అవి వైరల్ అయ్యాయి.

ఈ వీడియోలను గమనించిన పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ సానుభూతిపరులుగా భావిస్తున్న హబీబ్, రాణా హుస్సేన్ అనే వ్యక్తులు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా జహీద్‌ను సంప్రదించినట్లు పోలీసులు గుర్తించారు. వీరికి పాకిస్థాన్‌లో ఉన్న షెహబాద్ అనే అనుమానిత తీవ్రవాదితో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు నిఘా వర్గాలు భావిస్తున్నాయి. జహీద్‌ను తమ నెట్‌వర్క్‌లోకి చేర్చుకునేందుకు ఈ ముఠా ప్రయత్నించినట్లు, ఇందులో భాగంగా అతడికి అసలైన తుపాకులు అందిస్తామని హామీ ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. జహీద్ కూడా వారితో తరచూ వాయిస్ కాల్స్, చాటింగ్‌ల ద్వారా సంప్రదింపులు కొనసాగించినట్లు సాంకేతిక ఆధారాలు లభించాయని పోలీసులు తెలిపారు. సోషల్ మీడియా వేదికలపై నిఘా ఉంచిన కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు అతడి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి సాంకేతిక విశ్లేషణ నిర్వహించారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే విధంగా విదేశీ అనుమానితులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు గుర్తించిన అనంతరం మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు.

దీంతో అప్రమత్తమైన పోలీసులు అతడు పనిచేస్తున్న హోటల్‌పై దాడి చేసి జహీద్ ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న రెండు నకిలీ పిస్టళ్లు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అతని సంబంధాలు, సంప్రదింపులపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## గ్రామీణ మహిళలకు సొంత వేదిక

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వసతులు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును ప్రభుత్వం రూపొందించింది. ప్రతి గ్రామంలో నిర్మించనున్న మహిళా భవనాలు స్వయం సహాయక సంఘాలకు శాశ్వత కేంద్రాలుగా మారనున్నాయి. అంతేకాకుండా మహిళలు తయారు చేసే ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలు, మార్కెటింగ్ కార్యకలాపాలకు కూడా ఈ భవనాలు ఉపయోగపడనున్నాయి.

ఈ ప్రాజెక్టు అమలుతో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు ప్రత్యక్ష ప్రయోజనం కలగనుంది. ఇందిరమ్మ కమిటీల సమావేశాలు, మహిళా పారిశ్రామికవేత్తలకు శిక్షణ కార్యక్రమాలు, స్వయం ఉపాధి ప్రోత్సాహక కార్యక్రమాలకు ఈ కేంద్రాలు వేదికలుగా నిలవనున్నాయి. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న వడ్డీ లేని రుణాలు, మహాలక్ష్మి పథకం వంటి కార్యక్రమాలకు ఈ భవనాలు మరింత తోడ్పాటు అందించనున్నాయి.

సోమవారం ఉదయం 10.30 గంటలకు సచివాలయం లేదా ప్రజాభవన్ నుంచి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సంఘాల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చించనున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి అవసరాలు, భవిష్యత్ కార్యాచరణపై నేరుగా అభిప్రాయాలు సేకరించనున్నారు.

మహిళల అభివృద్ధి, ఆర్థిక పురోగతికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన నిధుల కేటాయింపుకు కట్టుబడి ఉందనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ఇవ్వనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం కోసం జిల్లా యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం.

# జూన్ 2 నుంచి 'ఇందిరమ్మ బీమా' అమలు

**మొదటిపేజీ తరువాయి**

భట్టి విక్రమార్క ప్రకటించారు. ప్రజల సామాజిక, ఆర్థిక భద్రతను బలోపేతం చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.

కుటుంబంలో అనుకోని ప్రమాదం లేదా ఇతర విపత్తుల కారణంగా ఆదాయ వనరు కోల్పోయిన పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోకుండా రూ.5 లక్షల బీమా రక్షణ అండగా నిలుస్తుందని అధికారులు చెబుతున్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయడానికి రూ.1 లక్ష కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మహిళల ఆదాయ వనరులు పెరగడం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. ఇప్పటికే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన ప్రభుత్వం, అదనంగా మరో 2 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారంటీల అమలుపై దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఇందిరమ్మ బీమా పథకాన్ని తీసుకురావడం ద్వారా సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తరించబోతోంది. జూన్ 2 నుంచి అమలులోకి రానున్న ఈ పథకం రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

# మాదాపూర్‌లో అర్ధరాత్రి రేసర్ల హంగామా

**హైదరాబాద్, మే 24 :**

మాదాపూర్‌లో అర్ధరాత్రి కార్లు, బైక్‌లతో రేసింగ్‌కు పాల్పడిన యువకుల హంగామా కలకలం రేపింది. వీకెండ్ సందర్భంగా నీలోఫర్ పరిసర ప్రాంతాల్లో రోడ్లపై వేగంగా దూసుకెళ్తూ కొందరు యువకులు రేసింగ్ నిర్వహించగా, వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని రేసింగ్ చేస్తున్న వాహనాలను నిలిపివేయాలని హెచ్చరించారు. అయితే కొందరు యువకులు పోలీసుల ఆదేశాలను పట్టించుకోకుండా మరింత వేగంగా వాహనాలు నడుపుతూ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించారు. కొన్ని వాహనాలు పోలీసుల వైపే దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు వెంటాడి



పలువురు రేసర్లను అదుపులోకి తీసుకున్నారు. తప్పించుకునేందుకు ప్రయత్నించిన కొన్ని కార్లను అడ్డుకుని తనిఖీలు నిర్వహించారు. ఒక కారులో ఉన్న వారు బయటకు రావడానికి నిరాకరించడంతో పోలీసులు వాహనం అద్దాలను పగులగొట్టి లోపల ఉన్న వారిని బయటకు తీసి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. వీకెండ్ రోజుల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి రేసింగ్‌లు, నిర్లక్ష్య డ్రైవింగ్ ఘటనలు పెరుగుతున్నాయని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే ఇలాంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# టార్గెట్ టీపీసీసీ చీఫ్

**మొదటిపేజీ తరువాయి**

ఉప ఎన్నికలోనూ పార్టీ విజయాన్ని నమోదు చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ బలహీనపడిందంటూ కథనాలు ప్రసారం చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. గాంధీ భవన్ పరిస్థితులు, కార్యాలయ నిర్వహణ అంశాలను చూపిస్తూ వస్తున్న కథనాలపై కూడా చర్చ జరుగుతోంది. గత అధ్యక్షుల కాలంలోనూ ఇదే పరిస్థితి కొనసాగిందని, ఇప్పుడు మాత్రం అన్ని విమర్శలను మహేష్ కుమార్ గౌడ్‌పై మోపడం వెనుక ప్రత్యేక వ్యూహం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో అధికార వర్గాల ప్రమేయం ఉందనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మహేష్ కుమార్



గౌడ్‌కు గతంలో సన్నిహిత సంబంధాలున్నాయని, టీపీసీసీ పదవి దక్కడంలో కూడా సీఎం పాత్ర కీలకమనే చర్చ అప్పట్లో జరిగింది. అయితే ఇటీవల పార్టీ వ్యవహారాలు, హైకమాండ్‌కు చేరుతున్న సమాచారం, బీసీ సీఎం వ్యాఖ్యలు వంటి అంశాలు ఇద్దరి మధ్య దూరం పెరగడానికి కారణమయ్యాయనే ప్రచారం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. మరోవైపు ఓ కీలక పదవి విషయంలో అసంతృప్తి చెందిన వర్గాలు కూడా ఈ ప్రచారానికి కారణమయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి.

తెలంగాణ కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు పూర్తిగా తగ్గలేదనే వ్యాఖ్యలు మరోసారి వినిపిస్తున్నాయి. ఒకవైపు సీఎం వర్గం, మరోవైపు టీపీసీసీ వర్గం అనేలా పార్టీ అంతర్గత సమీకరణాలు మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కేడర్‌ను పూర్తిగా సమన్వయం చేయడంలో టీపీసీసీ విఫలమైందనే విమర్శలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ పనితీరే ఎన్నికల్లో ప్రధాన పాత్ర పోషిస్తుందని మరికొందరు నేతలు అభిప్రాయపడుతున్నారు.

ఇలాంటి పరిణామాల మధ్య విదేశీ పర్యటనలో ఉన్న మహేష్ కుమార్ గౌడ్ స్పందిస్తూ కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మీడియాను గౌరవించడం పార్టీ బాధ్యతేనని, కాలమే అన్ని ప్రశ్నలకు సమాధానం చెబుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత రాజకీయాలు మరింత వేడెక్కుతున్న సంకేతాలుగా కనిపిస్తున్నాయి.

# హైదరాబాద్‌లోని నార్సింగి మూవీ టవర్స్ సెల్లార్‌లో భారీ అగ్నిప్రమాదం

**హైదరాబాద్, మే 24:**

నగరంలోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రముఖ నివాస సముదాయం 'మూవీ టవర్స్'లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మూవీ టవర్స్‌లోని సిబ్లాక్ సెల్లార్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. సెల్లార్ నుంచి పెద్దఎత్తున దట్టమైన పొగలు కమ్ముకోవడాన్ని గమనించిన నివాసితులు.. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించారు సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజిన్లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపుచేసే ప్రక్రియ కొనసాగించారు. మరోవైపు నార్సింగి పోలీసులు కూడా ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. అప్రమత్తమైన సిబ్బంది బ్లాక్‌లోని నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా లేదా ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది ఇంకా తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఆస్తి, ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరావాల్సి ఉంది.

# గడ్చిరోలి అడవుల్లో మావోయిస్టుల రహస్య స్థావరంపై పోలీసుల దాడి

- **ఆయుధాల తయారీ సామగ్రి, పేలుడు పదార్థాల ఉపకరణాల స్వాధీనం**
- **లొంగిపోయిన మావోయిస్టుల సమాచారం ఆధారంగా విజయవంతమైన ఆపరేషన్**

**గడ్చిరోలి, మే 24:**

మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మావోయిస్టులు అడవుల్లో రహస్యంగా దాచిపెట్టిన ఆయుధాల తయారీ సామగ్రి, పేలుడు పదార్థాల తయారీకి ఉపయోగించే పరికరాలను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వాటిని ఘటనాస్థలంలోనే ధ్వంసం చేశారు. లొంగిపోయిన మావోయిస్టుల నుంచి అందిన గోప్య సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

**అడవుల్లో దాచిన సామగ్రి వెలికితీత**

గతంలో మావోయిస్టులు ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలు, ఎన్నికల సమయంలో దాడులు, నక్సల్ వారోత్సవాల సందర్భంగా భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకునేందుకు ఆయుధాలు, పేలుడు పదార్థాలను అడవుల్లో దాచిపెట్టేవారని పోలీసులు తెలిపారు. అయితే జిల్లాలో మావోయిస్టు ప్రభావం గణనీయంగా తగ్గిపోవడంతో ఇలాంటి రహస్య నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకోవడంలో భద్రతా బలగాలు విజయవంతమవుతున్నాయని పేర్కొన్నారు.

**"ఆపరేషన్ ఫైనల్ స్ట్రైక్"లో కీలక సమాచారం**

మే 16న నిర్వహించిన "ఆపరేషన్ ఫైనల్ స్ట్రైక్"లో భాగంగా లొంగిపోయిన మావోయిస్టులను విచారించగా, పోమ్‌కెన్-బినగుండా అటవీ ప్రాంతంలో ఆయుధాల తయారీకి సంబంధించిన సామగ్రి దాచినట్లు సమాచారం లభించింది. దీంతో జిల్లా ఎస్పీ ఎం. రమేష్ ఆదేశాల మేరకు మే 21న ప్రత్యేక సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

**ఆరు ప్రత్యేక బృందాలతో గాలింపు**

స్పెషల్ ఆపరేషన్స్ టీమ్, ప్రాణహిత విభాగాలకు చెందిన ఆరు బృందాలు, బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్‌కు చెందిన రెండు బృందాలు సంయుక్తంగా అడవిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. మే 22న పోమ్‌కెన్-బినగుండా ఉత్తర అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టి తనిఖీలు నిర్వహించగా భారీ మొత్తంలో సామగ్రి బయటపడింది.

**భారీగా స్వాధీనం**

పోలీసులు లాథ్ మెషిన్, బీజీఎల్ పైపులు, 12 బోర్ పైపులు, ఇన్వర్టర్, జనరేటర్, బ్యాటరీలు, గ్రైండింగ్ మరియు డ్రిల్లింగ్ యంత్రాలు, జిగ్‌సా కట్టింగ్ మెషిన్, ప్రైజర్ పంప్, సోలార్ ప్యానెల్స్, 20 అడుగుల ఫుట్‌బాల్ పైప్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు సాహిత్యాన్ని కూడా గుర్తించి ఘటనాస్థలంలోనే ధ్వంసం చేశారు.

**సిబ్బందికి ఎస్పీ అభినందనలు**

ఈ ఆపరేషన్‌ను జిల్లా ఎస్పీ ఎం. రమేష్ పర్యవేక్షణలో అదనపు ఎస్పీలు కార్తిక్ మధిరా, గోకుల్ రాజ్ జీ, డీఎస్పీ (ఆపరేషన్స్) విశాల్ నగర్‌గోజే మార్గదర్శకత్వంలో ప్రత్యేక బృందాలు విజయవంతంగా పూర్తి చేశాయి. ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# రేవంత్‌ను కలిసిన విశ్వనాథన్

- **మర్యాదపూర్వకంగా భేటీ అయిన తమిళనాడు మంత్రి**
- **శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి**
- **ఆత్మీయంగా సత్కరించిన రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్, మే 24**

ఇటీవల తమిళనాడు ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పీ. విశ్వనాథన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో కొనసాగింది. ఇరు రాష్ట్రాల నాయకులు పరస్పరం ఆత్మీయ అభినందనలు తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విశ్వనాథన్‌ను ఘనంగా సత్కరించారు. తమిళనాడు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నందుకు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవలో మరింత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సమావేశంలో పరస్పర గౌరవం, సాన్నిహిత్యం స్పష్టంగా కనిపించింది. తమిళనాడులో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాల అనంతరం విశ్వనాథన్‌కు మంత్రివర్గంలో అవకాశం లభించింది. ఈ నేపథ్యంలో ఆయన తెలంగాణ పర్యటనకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ భారత రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగడం అభినందనీయమని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. భేటీ సందర్భంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనా అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలపై నాయకులు అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిసింది. ఇరు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం మరింత బలపడాలని ఆకాంక్ష వ్యక్తమైంది.ఈ సమావేశం సందర్భంగా పలువురు అధికారులు, నాయకులు కూడా హాజరైనట్లు సమాచారం. విశ్వనాథన్‌కు తెలంగాణ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. సమావేశం మొత్తం ఆత్మీయతతో కొనసాగింది. భవిష్యత్తులో కూడా ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని నాయకులు ఆకాంక్షించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా పరస్పర గౌరవంతో ముందుకు సాగడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు.



# రాష్ట్రంలో ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు..

- **తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం**
- **ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం**
- **వ్యవసాయ కనెక్షన్లు మినహా అందరికీ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు నిర్ణయం**
- **మీటర్ల ఖర్చును 60:40 నిష్పత్తిలో భరించనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**
- **వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం ఉండదన్న ప్రభుత్వం**
- **గత ప్రభుత్వ ఒప్పందాన్నే తాము ముందుకు తీసుకెళ్తున్నామన్న మంత్రి పొంగులేటి**



**తెలంగాణ బ్యూరో, మే 24:**

రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మినహా అన్ని విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రీవ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్ (ఆర్‌డీఎస్ఎస్)లో చేరాలన్న ప్రతిపాదనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శనివారం సమావేశమైన కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లు మినహా మిగిలిన అన్ని గృహ, వాణిజ్య కనెక్షన్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయనున్నారు.

**గత ప్రభుత్వ ఒప్పందాన్నే అమలు చేస్తున్నాం: మంత్రి పొంగులేటి**

కేబినెట్ సమావేశం అనంతరం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడం, విద్యుత్ నష్టాలను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అయితే, ఈ ఆర్‌డీఎస్ఎస్ పథకంలో చేరాలన్నది కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకున్న నిర్ణయం కాదని ఆయన స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర విద్యుత్ శాఖ, తెలంగాణ ప్రభుత్వం, సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరిందని గుర్తుచేశారు. కానీ, నాటి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లలేదని, అసెంబ్లీలో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

ఈ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును పూర్తిగా ప్రభుత్వాలే భరిస్తాయని, వినియోగదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొత్తం వ్యయంలో 60% కేంద్ర ప్రభుత్వం, 40% రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని అధికారులు తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రసక్తే లేదని మంత్రి పొంగులేటి మరోసారి తేల్చిచెప్పారు. డిస్కంల ఆదాయ, వ్యయాల మధ్య అంతరాన్ని తగ్గించి, వాటిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కాగా, విద్యుత్ ఛార్జీల పెంపు అంశం రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) పరిధిలోనే ఉంటుందని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు, ఛార్జీల పెంపునకు ప్రత్యక్ష సంబంధం లేదని అధికారులు స్పష్టం చేశారు.

# పాలమూరు ప్రజలను మోసం చేసిన కేసీఆర్



- **మంత్రి వాకిటి శ్రీహరి**

**షాద్‌నగర్, మే 24 :**

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో రెండుసార్లు అధికారంలోకి వచ్చి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేశారని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. ఆదివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతుల సంక్షేమం కోసం రైతుబిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాలేశ్వరం ప్రాజెక్టు పై ఉన్న ఆసక్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పై లేదని మంత్రి విమర్శించారు. ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యం చేసినందుకే ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్‌ను ప్రజలు ఘోరంగా ఓడించారని అన్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి 21 దశల్లో నీటిని ఎత్తిపోస్తామని చెప్పి, కేవలం పది దశలకే పరిమితం చేశారని ఆరోపించారు. ప్రాజెక్టు పనుల కోసం కేవలం రూ. 28 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. పర్యావరణ అనుమతులు లేకుండా, భూసేకరణ పూర్తి చేయకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తాజాగా జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ. 583 కోట్లు కేటాయించామని, త్వరితగతిన ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి శ్రీహరి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు. జిల్లా మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావుల కృషితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు ప్రజల పై ప్రేమతో ప్రాజెక్టు భూసేకరణకు నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# మక్కల కొనుగోళ్లకు మాది 'గ్యారంటీ'!

- **మార్క్‌ఫెడ్‌కు రూ.1867 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇస్తూ సర్కారు నిర్ణయం**
- **ఇప్పటికే రూ.4,173 కోట్ల మేర గ్యారంటీ**
- **ఇచ్చి, రూ.3,100 కోట్ల విలువైన మక్కల కొనుగోలు**

**హైదరాబాద్:**

రాష్ట్రంలో మార్కెట్‌కు తరలివస్తున్న మక్కల కొనుగోళ్లకు అవసరమైన రుణాలు సమకూర్చుకునేందుకు మార్క్‌ఫెడ్‌కు రూ.1867.77 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ మక్కల కొనుగోళ్లకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న మార్క్‌ఫెడ్‌కు ఇప్పటికే ప్రభుత్వం రూ.4,172.94 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇచ్చింది. దీంతో మక్కల కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.6,040.71 కోట్ల రుణాలు పొందేందుకు ప్రభుత్వం సహకారం అందించినట్టయ్యింది. మక్కలకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,400 ఉండగా, మార్కెట్‌లో రూ.1,700 నుంచి రూ.1,850 గిట్టుబాటు ధర పలుకుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధర కింద రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు 354 కొనుగోలు కేంద్రాల (పీఏసీఎస్‌లు) ద్వారా 2.33 లక్షల రైతుల నుంచి 12.85 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన మక్కల విలువ రూ. 3,100 కోట్ల వరకు ఉంటుంది. అయితే మార్కెట్‌కు భారీ ఎత్తున మక్కలు వస్తుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్‌కు అదనపు రుణం పొందేందుకు అవసరమైన బ్యాంకు గ్యారంటీని ప్రభుత్వం సమకూర్చింది.

**కేంద్రం సహకరించకపోయినా రైతులకు అండగా : మంత్రి తుమ్మల**

రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొనుగోళ్లపై ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వమే ముందుకొచ్చి భారీ స్థాయిలో కొనుగోళ్లు చేపట్టేందుకు సీఎం ఆమోదం తెలిపారన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో మొక్కజొన్న కొనుగోళ్లకు మొత్తం రూ.5,063 కోట్ల మేర మాత్రమే ఖర్చు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే దాదాపు రూ.6,000 కోట్ల మేర వ్యయం చేస్తోందని తుమ్మల స్పష్టం చేశారు.

**జొన్నల కొనుగోళ్లకు రూ.1,100 కోట్లు**

జొన్న (హైబ్రిడ్) కొనుగోళ్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్న ధర క్వింటాల్‌కు సుమారు రూ.2,000 మాత్రమే ఉండగా, కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.3,699గా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.1,100 కోట్లకు పైగా వ్యయంతో జొన్న కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లాల వారీగా జొన్న కొనుగోళ్ల ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఆదిలాబాద్ జిల్లాలో 26 కేంద్రాలు, సంగారెడ్డి జిల్లాలో 10 కేంద్రాలు, కామారెడ్డి జిల్లాలో 43 కేంద్రాలు, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



# కరీంనగర్‌లో ఘనంగా సూపర్ ఫైటర్స్ కప్–2026

- **తెలంగాణ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో క్రీడాకారుల ప్రతిభ**
- **వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పోటీలు**
- **విజేతలకు ట్రోఫీలు, పతకాల ప్రదానం**
- **సెన్సె అన్వేష్ సురభి ఆధ్వర్యంలో నిర్వహణ**

**కరీంనగర్, మే 24(రాజముద్ర న్యూస్):**

సూపర్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో "సూపర్ ఫైటర్స్ కప్-2026" తెలంగాణ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీలలో చిన్నారులు, యువకులు



వివిధ కేటగిరీల్లో పాల్గొని కటా, కుమిటే విభాగాల్లో ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య పోటీలు ఉత్సాహభరితంగా సాగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించడంలో మార్షల్ ఆర్ట్స్ కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి సెన్సై అన్వేష్ సురభి చీఫ్ ఆర్గనైజర్‌గా వ్యవహరించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు.

# శంషాబాద్.. విమానానికి బాంబు బెదిరింపు

**హైదరాబాద్:**


శంషాబాద్ విమానాశ్రయంలో బాంబు బెదిరింపు ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆమ్‌స్టర్‌డామ్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న ఓ విమానంలో బాంబు ఉన్నట్లు గుర్తు తెలియని వ్యక్తి మెయిల్ పంపడంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. విమానాశ్రయంలో విమానం ల్యాండ్ అయిన వెంటనే అధికారులు తనిఖీలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆమ్‌స్టర్‌డామ్ నుంచి శంషాబాద్‌కు వస్తున్న విమానంలో బాంబు ఉన్నట్టు ఆదివారం ఉదయం అధికారులకు మెయిల్ వచ్చింది. విమానం విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యేలోపే ఏ క్షణమైనా పేలుడు సంభవించే అవకాశం ఉందంటూ ఆ ఆగంతకుడు మెయిల్‌లో పేర్కొన్నాడు. ఈ సమాచారం అందుకున్న వెంటనే విమానాశ్రయ భద్రతా సిబ్బంది అత్యవసర చర్యలు చేపట్టారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే అందులోని ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించి ఐసోలేషన్ ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, భద్రతా సిబ్బంది విమానాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. సుదీర్ఘ తనిఖీల అనంతరం విమానంలో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. దీంతో విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ బాంబు బెదిరింపు మెయిల్‌పై విమానాశ్రయ అధికారులు పోలీసు

# బీసీ కులాల పేర్ల మార్పునకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం

- **కొన్ని కులాల పేర్లు ఇబ్బందికరంగా ఉన్నాయన్న బీసీ కమిషన్ సిఫారసు మేరకు నిర్ణయం**

**హైదరాబాద్, మే 24:**

వెనుకబడిన తరగతుల్లోని కొన్ని కులాల పేర్లు ఇబ్బందికరంగా ఉన్న అంశాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయా కులాల పేర్ల మార్పునకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ సిఫారసుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. బీసీ కులాల్లో గ్రూప్-ఏలో వరుస సంఖ్య 4లో ఉన్న బుడబుక్కల కులాన్ని శివ క్షత్రియగా మార్పు చేశారు. ఇదే కేటగిరీలోని వన్నార్ పేరును తొలగించి ధోబీగా మార్చారు. ఇకపై రజక, చాకలి, ధోబీ పేర్లలో ఏదైనా ఒక పేరును వాడుకోవచ్చని పేర్కొన్నారు. వరుస సంఖ్య 7లో ఉన్న దొమ్మర అనే పదాన్ని తొలగించి గడ వంశీయగా మార్పు చేశారు. వరుస సంఖ్య 18లో ఉన్న పిచ్చకుంట్ల పేరును వంశరాజ్‌గా మార్చారు. అలాగే వరుస సంఖ్య 23లో ఉన్న వీరభద్రియ పేరును వీరముష్టి, నెట్టి కోటల, వీరభద్రియగా సవరించారు. గ్రూప్-డీలో వరుస సంఖ్య 5లో ఉన్న మేర కులం పేరును మేరుగా మార్పు చేశారు. వరుస సంఖ్య 29లో ఉన్న శూద్ర కులం పేరును తొలగించి తమ్మలిగా మార్చుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



# రిజర్వేషన్లతో కొందరికే లబ్ధి!

## అసలైన అర్హులకు ఎప్పుడు న్యాయం..?

**దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 ఏళ్లు కావొస్తున్నా.. సామాజిక న్యాయం, సమాన అవకాశాలపై చర్చ మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించడమే రిజర్వేషన్ల అసలు ఉద్దేశం. కానీ, కాలక్రమేణా ఈ వ్యవస్థ కొందరి కుటుంబాలకు మాత్రమే పరిమితమవుతోందనే విమర్శలు పెరుగుతున్నాయి. తరతరాలుగా ఒకే కుటుంబాలు రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందుతుండగా.. అదే వర్గాల్లోని అత్యంత వెనుకబడిన వారికి అవకాశాలు అందకపోవడం ఆందోళన కలిగించే అంశం.**

ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాల పిల్లలకు కూడా అదే రిజర్వేషన్ కొనసాగాలా..? అని ధర్మాసనం ప్రశ్నించడం గమనార్హం. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులు అయితే.. వారి పిల్లలకు కూడా రిజర్వేషన్ అవసరమా?" అనే ప్రశ్న సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రిజర్వేషన్లు శాశ్వత హక్కు కాదనే భావన ఇప్పుడు బలపడుతోంది. ఒకసారి రిజర్వేషన్ ద్వారా ఉన్నత స్థాయికి చేరుకున్న కుటుంబాలు మళ్లీ అదే ప్రయోజనాన్ని తరతరాలకు కొనసాగించుకోవడం వల్ల అసలైన అర్హులు వెనుకబడిపోతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే విషయాన్ని గతంలో మాజీ సీజేఐ బీఆర్ గవాయ్ కూడా ప్రస్తావించారు. క్రీమీ లేయర్ వ్యవస్థను మరింత కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అప్పట్లోనే సూచించారు.

దేశంలో అనేక సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. నిరుద్యోగం, రైతు కష్టాలు, విద్యా వ్యయాలు, ఆరోగ్య సమస్యలు.. ఇలా ఎన్నో ఇబ్బందులతో సాధారణ ప్రజలు పోరాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాల్సింది పోయి.. ఓటు బ్యాంకు రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ప్రజాస్వామ్యంలో అవకాశాలు కొందరికే పరిమితం అయితే వ్యతిరేకత సహజం. ప్రపంచంలోని అనేక దేశాల్లో ప్రజా అసంతృప్తి ఎలా పెద్ద ఉద్యమాలుగా మారిందో చూశాం. నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ప్రజాగ్రహం రాజకీయ వ్యవస్థలను కుదిపేసింది. అందుకే పాలకులు ప్రజల భావోద్వేగాలను అర్థం చేసుకుని సమతుల్య నిర్ణయాలు తీసుకోవాలి.

రిజర్వేషన్ల అసలు లక్ష్యం సమాజంలోని అట్టడుగు వర్గాలను పైకి తీసుకురావడం. కానీ ఒకే కుటుంబాలు, ఒకే వర్గాలు నిరంతరం వాటి ప్రయోజనాలను అనుభవిస్తే.. చివరి వ్యక్తికి న్యాయం ఎలా జరుగుతుంది..? ఇదే ప్రశ్న ఇప్పుడు సమాజం ముందుంది. రాజకీయాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. రిజర్వేషన్ కోటాలో ఒకే కుటుంబాల నుంచి తరతరాలుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అవుతుండటం గమనించాల్సిన అంశం. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా విస్తృత చర్చ అవసరం. సామాజిక న్యాయం దెబ్బతినకుండా.. నిజంగా అవసరమైన వారికి అవకాశాలు అందేలా విధానాలు రూపుదిద్దుకోవాలి. అవసరమైతే చట్టపరమైన మార్పులు చేయాల్సిన సమయం ఆసన్నమైందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

**రిజర్వేషన్లు కొందరి శాశ్వత అధికారం కాకూడదు.. సమాజంలోని చివరి వ్యక్తికీ అవకాశం కల్పించే సాధనంగా మారినప్పుడే వాటి అసలు ఉద్దేశం నెరవేరుతుంది.**




# కాక్రోచ్ జనతా పార్టీ వెబ్‌సైట్ కూడా డౌన్

- కేంద్రంపై అభిజీత్ దీప్కే తీవ్ర విమర్శలు
- "కాక్రోచ్‌లకు ఎందుకు భయపడుతున్నారు?" అంటూ ప్రశ్న
- కొత్త ప్లాట్‌ఫామ్‌పై పని చేస్తున్నామని వెల్లడి







**న్యూఢిల్లీ, మే 23:** యువతలో విపరీతమైన ఆదరణ సంపాదించుకున్న సోషల్ మీడియా ఉద్యమం 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ)కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పార్టీకి చెందిన ఎక్స్ అకౌంట్ నిలిపివేత, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాకింగ్ ఆరోపణలు సంచలనం రేపగా.. తాజాగా అధికారిక వెబ్‌సైట్ కూడా పనిచేయడం ఆగిపోయింది. ఈ పరిణామంపై స్పందించిన పార్టీ వ్యవస్థాపకుడు ొూఎప్త్రఅయవవ్ ణవవజూనెవ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రభుత్వం కాక్రోచ్‌లకు ఎందుకు భయపడుతోంది? ఇది నియంతృత్వ ధోరణి" అంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అలాగే "కాక్రోచ్‌లు ఎప్పుడూ చావవు" అంటూ వ్యాఖ్యానించిన ఆయన.. త్వరలోనే కొత్త ప్లాట్‌ఫామ్‌తో ముందుకు వస్తామని తెలిపారు. తమను అణచివేసేందుకు కుట్ర జరుగుతోందని కూడా ఆరోపించారు. 'కాక్రోచ్ జనతా పార్టీ' తొలుత సోషల్ మీడియా వ్యంగ్య ఉద్యమంగా ప్రారంభమైంది. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, పరీక్షల లీకులు, యువత సమస్యలు, రాజకీయ వ్యవస్థపై సెటైరికల్ పోస్టులు చేస్తూ తక్కువ సమయంలోనే భారీ ఫాలోయింగ్ సంపాదించింది. ఇన్‌స్టాగ్రామ్‌లో కోట్లాది మంది ఫాలోవర్లను సంపాదించడంతో ఈ పేజీ దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇటీవల పార్టీకి చెందిన ఎక్స్ అకౌంట్ భారత్‌లో నిలిపివేయబడగా.. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ కూడా హ్యాక్ అయిందని నిర్వాహకులు ఆరోపించారు. ఇప్పుడు అధికారిక వెబ్‌సైట్ కూడా పని చేయకపోవడం కొత్త చర్చకు దారితీసింది. ఈ ఘటనపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. కొందరు దీన్ని భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా అభివర్ణిస్తుండగా.. మరికొందరు ఇది కేవలం వైరల్ రాజకీయ వ్యంగ్య ప్రచారమేనని అభిప్రాయపడుతున్నారు. సీజేపీపై వరుస ఆంక్షలు, సాంకేతిక సమస్యల వెనుక అసలు కారణాలేమిటన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. అయితే యువతలో ఈ ఉద్యమానికి పెరుగుతున్న ఆదరణ రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారితీస్తోంది.

# పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

- ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు
- తమ గగన తలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు




**టెహ్రాన్, మే 23:** పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్లు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

# దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

- చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన
- కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి
- అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం



**న్యూఢిల్లీ, మే 24:** దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ఒఊ ుజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది. 2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణేలిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది. చిన్నారి 2011 లో మిస్ అయింది కావున, 2013 లో వచ్చిన హోం శాఖ యాంటీ–ట్రాఫికింగ్ గైడ్‌లైన్స్ దీనికి వర్తించవని హైకోర్టు పేర్కొంది. ఈ తీర్పును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. 'చిన్నారి ఆచూకీ లభించనంత కాలం, చైల్డ్ ప్రొటెక్షన్ గైడ్‌లైన్స్, యాంటీ–ట్రాఫికింగ్ ప్రొటోకాల్స్ అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది' అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి, దేశవ్యాప్తంగా ఉన్న మిస్సింగ్ చిన్నారుల సమస్యపై ఈ సమగ్ర ఆదేశాలు జారీ చేసింది. ఇక, ఈ కేసు తదుపరి విచారణ ఆగస్టుకు వాయిదా వేసింది. ఆ సమయంలోగా అన్ని రాష్ట్రాలు, అధికారులు దీనిపై నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

# 5 రోజుల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలి





- ముందస్తు ప్రణాళికతో కొనుగోలు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి , రాజముద్ర న్యూస్:**

జిల్లాలోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద అకాల వర్షాలతో పంటలు తడవకుండా కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ నుంచి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక మహిళా సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్న చోట వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతులకు కనీస మద్దతు ధర చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారాల్లో కూడా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ఈ సీజన్‌లో తెలంగాణ రాష్ట్రంలో రికార్డు స్థాయిలో ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయడంతో పాటు రూ.45 వేల కోట్లకు పైగా చెల్లింపులు జరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ క్షేత్రాల్లో పంటల అవశేషాలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యం పెరగడంతో పాటు నేల సారవంతత దెబ్బతింటుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహించే మహిళా సంక్షేమ వారోత్సవాలను షెడ్యూల్ ప్రకారం విజయవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ, సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.

**నేటి నుండి మహిళా సాధికారిత కార్యక్రమాలు ప్రారంభం**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా రేపటి నుండి మే 25 నుండి 30 వరకు జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారిత కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక, ఆరోగ్య భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు కో పేర్కొన్నారు. కార్యక్రమాల్లో మహిళల భద్రతపై అవగాహన, పోషణ కార్యక్రమాలు, అంగన్‌వాడీ సేవల బలోపేతం, స్వయం సహాయక సంఘాల అభివృద్ధి, బాల్య వివాహాల నివారణ, మహిళల ఆరోగ్య పరీక్షలు, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలు, మండలాలు, పట్టణ స్థాయిలో అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఈసీఎల్ బి గిరి ఇంచార్జి, పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, డి ఎం శ్రీకాంత్, డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, రైస్ మిల్లర్స్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బకు దేశసంచారి మృతి

- ఎన్ఎస్పీ కాలువ పక్కన మృతదేహం..
- తమ్ముడి ఫిర్యాదుతో కేసు నమోదు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**

భార్యాభర్తల గొడవల కారణంగా 20 ఏళ్లుగా దేశసంచారిగా జీవనం గడుపుతున్న వ్యక్తి వడదెబ్బతో మృతిచెందిన ఘటన నేలకొండపల్లి మండలంలో చోటు చేసుకుంది. బీమాల నాగరాజు అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అతడి పెద్దన్నయ్య బీమాల వెంకటేశ్వర్లు, వయసు 44 సంవత్సరాలు, గత 20 సంవత్సరాలుగా కుటుంబ కలహాలతో భార్యను వదిలేసి దేశసంచారిగా తిరుగుతూ జీవిస్తున్నాడు.గత నెల రోజులుగా నేలకొండపల్లి పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న వెంకటేశ్వర్లు ఈరోజు ఉదయం నేలకొండపల్లి నుంచి బోదులబండ వెళ్లే మార్గం మధ్యలో ఎన్ఎస్పీ కాలువ పక్కన వడదెబ్బ తగిలి ఎండకు తట్టుకోలేక మృతిచెందినట్లు ఫిర్యాదుదారుడు తెలిపాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నేలకొండపల్లి ఎస్ఐ పి సంతోష్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత మృతికి గల పూర్తి కారణాలు వెల్లడవుతాయన్నారు.

# బీసీ గురుకుల సీట్లకేటాయింపు!

**జూనియర్, డిగ్రీ కాలేజీల తొలి దశ ఫలితాలు విడుదల**

**ఈ నెల 30 వరకు కాలేజీల్లో చేరాలి**

**వెబ్‌సైట్‌లో వివరాలు వెల్లడించిన కార్యదర్శి సైదులు**

**హైదరాబాద్, మే 24 :** తెలంగాణ రాష్ట్ర బీసీ గురుకుల విద్యా సంస్థ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను జూనియర్ ఇంటర్మీడియట్, డిగ్రీ కాలేజీల అడ్మిషన్ల మొదటి దశ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు వివరాలు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఫలితాలను, తమకు కేటాయించిన కాలేజీల వివరాలను సంస్థ అధికారిక వెబ్‌సైట్ల ద్వారా పరిశీలించుకోవచ్చని తెలిపారు. పదో తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కుల ఆధారంగానే, ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండా ఈ సీట్లను కేటాయించినట్లు స్పష్టం చేశారు.

**ఈ నెల 30 లోగా చేరాలి**

సీట్లు పొందిన విద్యార్థులు తమకు కావాల్సిన అన్ని రకాల అసలు ధృవీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని కార్యదర్శి సూచించారు. ఈ నెల 25వ తేదీ నుండి 30వ తేదీ లోపు సంబంధిత కాలేజీలకు వెళ్లి అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువు దాటితే సీటు పొందే అవకాశం కోల్పోతారన్నారు. అడ్మిషన్లకు సంబంధించిన మరిన్ని వివరాలు, సందేహాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ నెంబర్ 040-23328266 లో సంప్రదించవచ్చని బడుగు సైదులు తెలిపారు.

# సుడా చైర్మన్‌గా పువ్వాళ్ల దుర్గాప్రసాద్!

**గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఖాదర్ బాబా**

**అభినందించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**ఖమ్మం, మే 24 :** స్తంభాద్రి పట్టణ అభివృద్ధి సంస్థ (సుడా) నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పువ్వాళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబాలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వీరిద్దరూ తమ సుదీర్ఘ అనుభవంతో జిల్లా ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందిస్తూ ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సంస్థల బలోపేతానికి, వనరుల కొరత లేకుండా చూడటానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా మంత్రులతో పాటు తాను కూడా వీరికి నిరంతరం అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

**కార్యకర్తల త్యాగాలే పునాది**

గత పదేళ్ల కష్టకాలంలో పార్టీ జెండాను భుజాన వేసుకుని నిలబడిన ప్రతి ఒక్క కార్యకర్తను, నాయకుడిని ఈ ప్రజా ప్రభుత్వం గుర్తుపెట్టుకుంటుందని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. అర్హులైన వారందరికీ భవిష్యత్తులో తగిన గౌరవం, పదవులు కల్పిస్తామన్నారు. నాడు కొందరు నేతలు పార్టీ వీడినా, కాంగ్రెస్‌ను గుండెల్లో పెట్టుకుని కాపాడిన కార్యకర్తల త్యాగాల వల్లే నేడు రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం సాధ్యమైందని కొనియాడారు. కార్యకర్తల కష్టాన్ని ఈ ప్రభుత్వం ఎన్నటికీ మరువదని స్పష్టం చేశారు.

# ఎంపీ వేం నరేందర్ రెడ్డికి ఘన సన్మానం!

**హనుమకొండలో కాంగ్రెస్ ఆత్మీయ సభ**

**సీఎం రేవంత్ విజయాల్లో నరేందర్ రెడ్డి పాత్ర కీలకం**

**రాజ్యసభలో ప్రజా గళం వినిపిస్తారు: మంత్రి కొండా సురేఖ**





**హనుమకొండ, మే 24 :** హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ సెంటర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ ఘనంగా జరిగింది. ఇటీవల రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ప్రత్యేకంగా సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగడంలో, పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించడంలో వేం నరేందర్ రెడ్డి సూచనలు, సలహాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి కొండా సురేఖ కొనియాడారు. రాబోయే రోజుల్లో వరంగల్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ఆయన మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, నిధుల సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. వేం నరేందర్ రెడ్డి ప్రత్యేక వ్యక్తిత్వాన్ని ప్రస్తావిస్తూ మంత్రి సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "వేం అన్న సాధారణంగా చాలా మౌనంగా ఉంటారు. కానీ సరైన అంశం వచ్చినప్పుడు అనర్గళంగా మాట్లాడే గొప్ప సామర్థ్యం ఆయన సొంతం" అని కొనియాడారు. అదే పట్టుదలతో రాజ్యసభలోనూ తెలంగాణ ప్రజల సమస్యలను, రాష్ట్ర హక్కులను బలంగా వినిపిస్తూ ఉత్తమ పార్లమెంటేరియన్‌గా రాణిస్తారని ఆశిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

# రేవంత్‌పై జీవన్‌రెడ్డి విమర్శలు

**ధాన్యం కొనుగోళ్లపై ఆగ్రహం**

**హైదరాబాద్, మే 24:** రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని భారత్ రాష్ట్ర సమితి జనరల్ సెక్రటరీ జీవన్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందాల పోటీలు, ఫుట్‌బాల్ మ్యాచ్‌లపై ఉన్న ఆసక్తి రైతుల నుంచి ధా న్యం కొనుగోలు చేయడంలో కనిపించడం లేదని మండిపడ్డారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని జీవన్‌రెడ్డి ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులు తమ పంటను కాపాడుకోవడానికి ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన సమయంలో ప్రభుత్వం ఇతర కార్యక్రమాలపై ఎక్కువ దృష్టి పెడుతోందని జీవన్‌రెడ్డి విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడాలంటే రైతులకు న్యాయం చేయాల్సిందేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో రైతుల పరిస్థితిపై ప్రభుత్వం నిజమైన దృష్టి పెట్టాలని జీవన్‌రెడ్డి సూచించారు. కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర, సకాలంలో కొనుగోలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. రైతుల సమస్యలను విస్మరిస్తే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



# నల్గొండ డాక్టర్ సెల్ చైర్మన్‌గా ఫణి కుమార్!

**ప్రముఖ కార్డియాలజిస్ట్‌కు కీలక బాధ్యతలు**

**నియామక పత్రం అందజేసిన పీసీసీ నాయకత్వం**

**కాంగ్రెస్ శ్రేణుల హర్షం**



**నల్లగొండ, మే 24 :** నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ చకిలం ఫణి కుమార్‌కు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ డాక్టర్ సెల్ వైద్య, ఆరోగ్య విభాగంలో కీలక బాధ్యతలు దక్కాయి. ఆయనను నల్గొండ డాక్టర్ సెల్ జిల్లా చైర్మన్‌గా నియమిస్తూ పీసీసీ నాయకత్వం అధికారిక నియామక పత్రాన్ని అందజేసింది. డాక్టర్ చకిలం ఫణి కుమార్ వైద్య రంగంలో విశేష అనుభవం కలిగి ఉండగా, పార్టీ ఆయన సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా డాక్టర్ ఫణి కుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు, వైద్య రంగ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ నియామకంపై కాంగ్రెస్ శ్రేణులు, ఆయన అభిమానులు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేస్తాం!

- కేసీఆర్ ప్రజలకు ద్రోహం చేశాడు
- లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు వేగవంతం
- త్వరలోనే భూసేకరణ ప్రారంభం
- కులగణనతో వెనుకబడిన వర్గాలకు న్యాయం
- మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, మే 24 :** పాలమూరు ప్రాజెక్టు పేరు చెప్పి రెండుసార్లు ఘనవిజయం సాధించిన కేసీఆర్, ఆ తర్వాత మాట తప్పి పాలమూరు ప్రజలకు ద్రోహం చేశాడని రాష్ట్ర క్రీడలు, పాడి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆరోపించారు. పాలమూరు బిడ్డగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంతానికి ఖచ్చితంగా న్యాయం చేస్తాడన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కలను సాకారం చేయడానికి నిధులు మంజూరు కావడం వెనుక ఎమ్మెల్యే శంకర్ కృషి ఎంతో ఉందన్నారు.

**గత ప్రభుత్వంపై నిప్పులు**

పర్యావరణ అనుమతులు లేకుండా, భూసేకరణ జరపకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి గత ప్రభుత్వం నిధులు దుర్వినియోగం చేసిందని మంత్రి శ్రీహరి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కోట్లు ఖర్చుపెట్టిన గత ప్రభుత్వం పాలమూరును ఎందుకు విస్మరించిందో యువత ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. 58 వేల కోట్లు మంజూరైతే కేవలం 28 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, మిగతావి అవినీతికి వాడుకున్నారని ఆరోపించారు. రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల కలెక్టరేట్లలో సమావేశాల అనంతరం చర్చించి ప్రాజెక్టు పనుల్లో ముందడుగు వేస్తామని, భూసేకరణ పూర్తి చేసి పెండింగ్ పనులను వేగవంతం చేస్తామని స్పష్టం చేశారు.

**కులగణనతో కొత్త వెలుగు**

జనగణన, కులగణన కార్యక్రమాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మవద్దని కోరారు. గతంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వగా, ఈ విడత అదనంగా మరో రెండు వేల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందమోహన్, చెంది తిరుపతి రెడ్డి, పి.రఘు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



# స్థిరంగా బంగారం.. వెండి

**హైదరాబాద్, మే 24 :** గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నప్పటికీ.. ఈరోజు మాత్రం ధరలు నిలకడగా ఉండటంతో కొనుగోలుదారులు కొంత ఊరట వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వివాహాలు, శుభకార్యాల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో బంగారం కొనుగోలు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. అయితే ఇటీవల ధరలు భారీగా పెరగడంతో సాధారణ వినియోగదారులు ఆందోళనకు గురయ్యారు. ఇప్పుడు ధరలు స్థిరపడటంతో మార్కెట్‌లో కొనుగోళ్లు మళ్లీ ఊపందుకుంటున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,060గా కొనసాగుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,45,800గా నమోదైంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,210గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,950గా ఉంది. వెండి ధరలు కూడా ఈరోజు పెద్దగా మార్పులేకుండా కొనసాగుతున్నాయి. హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,95,000గా ఉంది. చెన్నైలో కూడా ఇదే ధర కొనసాగుతోంది. ఇక ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో కిలో వెండి ధర రూ.2,85,000గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ మారకం విలువ, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు వంటి అంశాలు బంగారం ధరలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గుచూపుతున్నప్పుడు బంగారానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అయితే బంగారం, వెండి ధరలు రోజువారీగా మారుతూ ఉంటాయి కాబట్టి కొనుగోలు చేయాలనుకునే వారు ముందుగా స్థానిక మార్కెట్ ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని వ్యాపారులు సూచిస్తున్నారు.

# తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్?

**న్యూయార్క్, మే 24 :** ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా కొనసాగుతున్న ప్రముఖ వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ త్వరలోనే ప్రపంచ చరిత్రలో తొలి ట్రిలియనీర్‌గా అవతరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతరిక్ష పరిశోధనల రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఆయన సంస్థ స్పేస్‌ఎక్స్ భారీ స్థాయిలో ప్రజా వాటాల విక్రయానికి సిద్ధమవుతుండటంతో మస్క్ ఆస్తుల విలువ అమాంతం పెరగనుందని అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారుల దృష్టి మొత్తం స్పేస్‌ఎక్స్‌పైనే కేంద్రీకృతమైంది. ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ టెస్లా ద్వారా ప్రపంచ వ్యాపార రంగాన్ని ప్రభావితం చేస్తున్న మస్క్.. అంతరిక్ష రంగంలోనూ స్పేస్‌ఎక్స్‌తో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. ఉపగ్రహ ప్రయోగాలు, పునర్వినియోగ రాకెట్లు, అంతరిక్ష ప్రయాణాలు, ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ సేవల విస్తరణ వంటి రంగాల్లో ఈ సంస్థ అసాధారణ వేగంతో ఎదుగుతోంది. ముఖ్యంగా స్టార్‌లింక్ సేవలకు పెరుగుతున్న డిమాండ్ స్పేస్‌ఎక్స్ విలువను మరింత పెంచుతోందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక విశ్లేషకుల అంచనాల ప్రకారం స్పేస్‌ఎక్స్ మార్కెట్ విలువ సుమారు 1.75 లక్షల కోట్ల డాలర్ల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఒకవేళ ప్రజా వాటాల విక్రయం సమయంలో సంస్థ విలువ 2 లక్షల కోట్ల డాలర్లను తాకితే.. మస్క్ వ్యక్తిగత సంపద 1 ట్రిలియన్ డాలర్లను దాటే అవకాశముందని చెబుతున్నారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.96 లక్షల కోట్లకు పైగానే ఉంటుంది. ప్రస్తుతం టెస్లా, స్పేస్‌ఎక్స్, కృత్రిమ మేధస్సు సంస్థలు, సాంకేతిక రంగంలోని ఇతర పెట్టుబడులతో మస్క్ సంపద ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక స్థాయిలో ఉంది. అంతరిక్ష రంగాన్ని పూర్తిగా మార్చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్న మస్క్.. భవిష్యత్తులో చంద్రుడు, మంగళగ్రహ మిషన్లపై భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మానవాళిని ఇతర గ్రహాలపై స్థిరపరచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న ఆయన ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇదే సమయంలో స్పేస్‌ఎక్స్ ప్రజా వాటాల విక్రయం విజయవంతమైతే కంపెనీ విలువ మరింత పెరిగే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ ఆర్థిక విస్తరణ వల్ల మస్క్ మాత్రమే కాదు.. స్పేస్‌ఎక్స్‌లో పనిచేస్తున్న పలువురు కీలక అధికారులు కూడా బిలియనీర్ల జాబితాలో చేరనున్నట్లు సమాచారం. సంస్థ అధ్యక్షురాలు శ్రీ గ్విన్ షాట్‌వెల్, ప్రధాన ఆర్థిక అధికారి బ్రెట్ జాన్సన్, బోర్డు సభ్యుడు ల్యూక్ నాసెక్ తదితరుల సంపద కూడా భారీగా పెరగనుంది. ప్రపంచ ఆర్థిక చరిత్రలో ఇప్పటివరకు ఎవరూ చేరుకోని స్థాయికి మస్క్ చేరుకునే అవకాశముండటంతో వ్యాపార, సాంకేతిక రంగాల్లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ఒక సాధారణ సాంకేతిక వ్యాపారవేత్తగా ప్రారంభమైన ఎలాన్ మస్క్ ప్రయాణం ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే స్థాయికి చేరుకోవడం విశేషంగా మారింది.




# వచ్చే వారం నాలుగు రోజులే ట్రేడింగ్




**ముంబై, మే 24 :** భారతీయ స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్లు, రోజువారీ ట్రేడింగ్ చేసే వ్యాపారులు వచ్చే వారం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మే 25 నుంచి మే 31 మధ్య స్టాక్ మార్కెట్లు కేవలం నాలుగు రోజులు మాత్రమే పనిచేయనున్నాయి. మే 28వ తేదీన బక్రీద్ పండుగ సందర్భంగా దేశంలోని ప్రధాన స్టాక్ మార్కెట్ సంస్థలు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ అధికారిక సెలవు ప్రకటించాయి. ఇప్పటికే ప్రతి వారం శని, ఆదివారాల్లో మార్కెట్లు మూసివేస్తుండటంతో మే 30, 31 తేదీల్లో కూడా ట్రేడింగ్ జరగదు. దీంతో వరుసగా మూడు రోజుల పాటు మార్కెట్ కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ కారణంగా ట్రేడర్లు, డెరివేటివ్ వ్యాపారులు, స్వల్పకాలిక పెట్టుబడిదారులు తమ వ్యూహాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఈ మూడు రోజుల విరామం ప్రభావం ఈక్విటీ మార్కెట్లకే పరిమితం కాదు. డెరివేటివ్స్, కరెన్సీ ట్రేడింగ్, కమోడిటీ సెగ్మెంట్లలో కూడా ఎలాంటి లావాదేవీలు జరగవు. సాధారణంగా గురువారాల్లో ముగిసే వీక్లీ డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ఈసారి సెలవు కారణంగా ఒక రోజు ముందుకు జరగనుంది. దీంతో మే 28కు బదులుగా మే 27వ తేదీ బుధవారం నాడే వారాంతపు ఎక్స్‌పైరీ పూర్తయ్యే అవకాశముందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఆప్షన్స్ ట్రేడింగ్, ఫ్యూచర్స్ ఒప్పందాల్లో ఒడిదుడుకులు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా తక్కువ ట్రేడింగ్ రోజుల కారణంగా మార్కెట్‌లో అస్థిరత పెరగవచ్చని హెచ్చరిస్తున్నారు. విదేశీ పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావం, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కూడా దేశీయ మార్కెట్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక గత వారం దేశీయ మార్కెట్లు సానుకూల ధోరణిలో కొనసాగాయి. దేశీయ సూచీలు లాభాలతో ముగియడంతో పెట్టుబడిదారుల్లో కొంత ఉత్సాహం కనిపించింది. నిఫ్టీ 50 సూచీ గత వారాంతంలో సుమారు 1.50 శాతం పెరిగి 23,719 పాయింట్ల వద్ద ముగియగా, సెన్సెక్స్ సుమారు 1.55 శాతం లాభపడి 75,415 పాయింట్ల వద్ద స్థిరపడింది. బ్యాంకింగ్, ఐటీ, ఆటోమొబైల్ రంగాల్లో కొనుగోళ్లు పెరగడం మార్కెట్‌కు మద్దతుగా నిలిచింది. అయితే వచ్చే వారం ట్రేడింగ్ రోజులు తగ్గిపోవడంతో పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా షార్ట్ టర్మ్ ట్రేడర్లు అధిక రిస్క్ తీసుకోకుండా మార్కెట్ ధోరణిని గమనిస్తూ ముందుకు సాగాలని చెబుతున్నారు. ప్రపంచ మార్కెట్ల ప్రభావం, అంతర్జాతీయ ముడి చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాలు వచ్చే వారం దేశీయ మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మెటాలో చైనా ఉద్యోగుల ఆధిపత్యంపై వివాదం

**ముంబై, మే 24 :** అమెరికాకు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమ సంస్థ మెటాలో చైనా ఉద్యోగుల ప్రభావం ఎక్కువగా ఉందంటూ మాజీ ఇంజినీర్ జెరెమీ బెర్నియర్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీశాయి. ఇటీవల కంపెనీలో ఉద్యోగుల తొలగింపుల తర్వాత స్పందించిన ఆయన.. ముఖ్యంగా ప్రకటనలు, సాంకేతిక విభాగాల్లో చైనా దేశానికి చెందిన ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉందని పేర్కొన్నారు. సంస్థలో జరిగే అధికారిక సమావేశాలు ముగిసిన తర్వాత పలువురు చైనా ఉద్యోగులు తమ మాతృభాష అయిన మాండరిన్‌లోనే మాట్లాడుకుంటూ ఉంటారని బెర్నియర్ వెల్లడించారు. దీనివల్ల




ఇతర దేశాలకు చెందిన ఉద్యోగులు చర్చల నుంచి దూరమైన భావనకు గురవుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగులు పనిచేసే సంస్థల్లో అందరికీ సమాన అవకాశాలు, కలుపుగోలుతనం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విదేశాల్లో ఉన్నవారు తమ మాతృభాషలో మాట్లాడుకోవడం సహజమని కొందరు నెటిజన్లు చైనా ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు, అంతర్జాతీయ సంస్థల్లో అన్ని దేశాల ఉద్యోగులు సౌకర్యంగా పనిచేసే వాతావరణం అవసరమని మరికొందరు అభిప్రాయపడుతున్నారు.

# జియో ఐపీవోకు మళ్లీ బ్రేక్





**న్యూఢిల్లీ, మే 24:** దేశీయ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద ఐపీవోలలో ఒకటిగా భావిస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీస్కు చెందిన జియో ఐపీవో మరోసారి వాయిదా పడినట్లు సమాచారం. గత కొన్ని నెలలుగా వాయిదాలు ఎదుర్కొంటున్న ఈ ప్రక్రియపై సంస్థ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేకపోతున్నట్టు తెలుస్తోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, ప్రపంచ మార్కెట్ల అస్థిరత వంటి అంశాలు ఈ నిర్ణయంపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనసాగుతున్న ఒడిదుడుకులు, విదేశీ మూలధన ప్రవాహాల తగ్గుదల కారణంగా ఐపీవో విడుదలకు ఇది సరైన సమయం కాదనే అభిప్రాయం సంస్థలో వ్యక్తమవుతున్నట్టు సమాచారం. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ సంస్థ ఈ ఐపీవో ద్వారా భారీ స్థాయిలో పెట్టుబడులు సమీకరించాలని భావించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు పెట్టుబడిదారుల స్పందనపై ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మార్కెట్ పరిస్థితులు అనుకూలంగా మారే వరకు వేచి చూడాలనే ఆలోచనలో సంస్థ ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ఐపీవో ప్రక్రియను పూర్తిగా నిలిపివేయలేదని, త్వరలోనే భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డుకు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్టు కంపెనీ వర్గాలు సంకేతాలు ఇచ్చాయి.

# చైనాలో విస్కీ క్రేజ్

**బీజింగ్, మే 24:** చైనాలో శతాబ్దాలుగా వస్తున్న సాంప్రదాయ మద్యం అలవాట్లు ఇప్పుడు వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు చైనీయుల జీవనశైలిలో భాగమైన సాంప్రదాయ మద్యం "బైజియు" స్థానంలో, ప్రస్తుతం అక్కడి యువత పాశ్చాత్య పానీయాల వైపు అడుగులు వేస్తోంది. ముఖ్యంగా నగర ప్రాంతాల్లో నివసించే యువత, ఐటీ రంగానికి చెందిన ఉద్యోగులు, కార్పొరేట్ వర్గాలు విస్కీని ఒక ఆధునిక జీవనశైలికి, సామాజిక హోదాకు ప్రతీకగా భావిస్తూ ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీంతో గత నాలుగేళ్లలోనే చైనా విస్కీ మార్కెట్ విలువ ఊహించని విధంగా సుమారు 2.3 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 19,000 కోట్లకు పైగా) చేరుకుంది. ప్రస్తుతం అక్కడి రాత్రి వేళ వినోద కేంద్రాలు, లగ్జరీ రెస్టారెంట్లు, ప్రీమియం బార్లలో విస్కీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలకు చెందిన ప్రముఖ అంతర్జాతీయ మద్యం కంపెనీలు చైనాలోనే నేరుగా విస్కీ తయారీ యూనిట్లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. అయితే, చైనా సంస్కృతితో ముడిపడి ఉన్న బైజియు ఆదరణ గ్రామీణ ప్రాంతాలు, వృద్ధుల్లో ఇంకా తగ్గలేదు. అయినప్పటికీ, విస్కీ నుంచి ఎదురవుతున్న గట్టి పోటీని తట్టుకునేందుకు స్థానిక బైజియు కంపెనీలు కూడా అప్రమత్తమయ్యాయి. యువతను ఆకట్టుకోవడానికి తక్కువ మత్తు శాతం, కొత్త ఫ్లేవర్లు, ఆధునిక ప్యాకేజింగ్‌తో కొత్త వ్యూహాలతో ముందుకొస్తున్నాయి. ప్రస్తుతం చైనా మద్యం మార్కెట్లో సాంప్రదాయానికి, ఆధునికతకు మధ్య ఆసక్తికరమైన పోటీ కొనసాగుతోంది.




# రూపాయి మారక విలువలో జోక్యం లేదు



**న్యూఢిల్లీ, మే 24 :** రూపాయి మారకపు విలువల్లో కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ప్రత్యక్ష జోక్యం చేసుకోవడం లేదని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. రూపాయి పతనాన్ని అడ్డుకునేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు, ప్రపంచ మార్కెట్ ధోరణులు, పెట్టుబడుల ప్రవాహాల ఆధారంగానే కరెన్సీల మారక విలువలు నిర్ణయించబడతాయని ఆయన తెలిపారు. కరెన్సీ ట్రేడింగ్ ప్రక్రియలో ప్రభుత్వం నేరుగా జోక్యం చేసుకోదని పేర్కొన్నారు. దేశీయ ఎగుమతులను ప్రోత్సహించేందుకు కేంద్రం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని మంత్రి వెల్లడించారు. అదే సమయంలో అవసరం లేని దిగుమతులను నియంత్రించేందుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. దేశీయ పరిశ్రమలు, పెట్టుబడులను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# దివీస్ ల్యాబ్‌కు భారీ లాభాలు

**హైదరాబాద్, మే 24 :** ప్రముఖ ఔషధ తయారీ సంస్థ దివీస్ ల్యాబొరేటరీస్ మార్చితో ముగిసిన త్రైమాసికంలో అంచనాలకు మించి ఆర్థిక ఫలితాలు నమోదు చేసింది. ఈ కాలంలో సంస్థ నికర లాభం రూ.751 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది సుమారు 13 శాతం వృద్ధిగా నమోదైంది. కంపెనీ ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది. వార్షిక ప్రాతిపదికన 9.5 శాతం వృద్ధితో సంస్థ ఆదాయం రూ.2,831 కోట్లకు చేరుకున్నట్లు వెల్లడించింది. ఔషధాల ఎగుమతులు, కీలక ఉత్పత్తుల అమ్మకాలు పెరగడం సంస్థ పనితీరుకు బలం చేకూర్చినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కంపెనీ ప్రతి షేరుకు రూ.30 తుది డివిడెండ్ ప్రకటించింది. దీంతో సంస్థ షేర్ హోల్డర్లకు మంచి లాభం దక్కనుంది.






# ఈడెన్‌లో ఢిల్లీ జయభేరి!


- కోల్ కతా పై 40 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం
- కే ఎల్ రాహుల్ మెరుపు అర్ధ సెంచరీ, అక్షర్ పటేల్ బాదుడు
- చేతులెత్తేసిన కోల్ కతా బ్యాటర్లు.. రహానే ఒంటరి పోరాటం
- రాణించిన లుంగీ ఎంగిడి, కుల్దీప్ యాదవ్, మిచెల్ స్టార్క్

ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఆదివారం జరిగిన ఐ పీ ఎల్ మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ పై ఢిల్లీ క్యాపిటల్స్ 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ లో కే ఎల్ రాహుల్ మెరుపులతో భారీ స్కోరు సాధించిన ఢిల్లీ.. ఆ తర్వాత బౌలింగ్ లోనూ సమష్టిగా రాణించి కోల్ కతాను కట్టడి చేసింది. సొంతగడ్డపై కోల్ కతా బ్యాటర్లు పూర్తిగా చేతులెత్తేయడంతో ఆ జట్టుకు పరాజయం తప్పలేదు.

**కోల్‌కతా, మే 25 :** కోల్ కతా లోని ఈడెన్ గార్డెన్స్ లో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన కోల్ కతా నైట్ రైడర్స్ బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ కే ఎల్ రాహుల్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 30 బంతుల్లో 60 పరుగులు చేసి జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. అతనికి జతగా అక్షర్ పటేల్ 25 బంతుల్లో 39 పరుగులు, డేవిడ్ మిల్లర్ 19 బంతుల్లో 28 పరుగులతో రాణించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కోల్ కతా బౌలర్లలో సౌరభ్ దూబే 4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 2 వికెట్లు తీయగా, అనుకుల్ రాయ్, వరుణ్ చక్రవర్తి తలా ఒక వికెట్ పడగొట్టారు.

## రహానే పోరాటం వృథా..

204 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కోల్ కతా నైట్ రైడర్స్ కు ఏ దశలోనూ సరైన భాగస్వామ్యాలు దక్కలేదు. అజింక్యా రహానే ఒక్కడే 39 బంతుల్లో 63 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. మిడిలార్డర్ లో రోవ్ మన్ పావెల్ 21 బంతుల్లో 29 పరుగులు, మనీశ్ పాండే 16 బంతుల్లో 25 పరుగులతో కాసేపు పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో కోల్ కతా 18.4 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌట్ అయింది. ఢిల్లీ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి వికెట్లు పడగొట్టారు. లుంగీ ఎంగిడి 3.4 ఓవర్లలో 27 పరుగులిచ్చి 3 వికెట్లు, కుల్దీప్ యాదవ్ 4 ఓవర్లలో 29 పరుగులిచ్చి 3 వికెట్లు తీసి కోల్ కతా పతనాన్ని శాసించారు. మిచెల్ స్టార్క్ 3 ఓవర్లలో 26 పరుగులిచ్చి 2 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు.








# ప్లే ఆఫ్స్‌కు రాజస్థాన్

ముంబైలోని వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ పై రాజస్థాన్ రాయల్స్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్ స్థానాన్ని పదిలపర్చుకుంది. లీగ్ దశ ముగిసే సమయానికి ఐ పి ఎల్ 2026 ప్లే ఆఫ్స్ ఆడే నాలుగు జట్లు కూడా ఖరారైపోయాయి. రాజస్థాన్ జట్టు తన ప్లే ఆఫ్స్ టిక్కెట్ ను అధికారికంగా ఖరారు చేసుకుంది.




- ఖరారైన టాప్-4 జట్లు!
- వాంఖడేలో రాయల్స్ విధ్వంసం..
- 30 పరుగుల తేడాతో ముంబైని మట్టికరిపించిన రాయల్స్
- జోఫ్రా ఆర్చర్ అల్ రౌండ్ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్
- 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించిన రాజస్థాన్
- ఖరారైన టాప్ 4 జట్లు.. ఆర్సీబీ, జిటీ, ఎస్ఆర్‌హెచ్, ఆర్ఆర్






**ముంబై, మే 24 (మనసులో మాట):** వాంఖడే స్టేడియంలో జరిగిన ఈ కీలక మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఓపెనర్ ధ్రువ్ జురెల్ 26 బంతుల్లో 38 పరుగులు చేసి జట్టుకు మంచి ప్రారంభాన్ని అందించాడు. జోఫ్రా ఆర్చర్ అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో కేవలం 15 బంతుల్లో 32 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దాసున్ షనక కూడా 15 బంతుల్లో 29 పరుగులతో రాణించాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ 4 ఓవర్లలో 41 పరుగులిచ్చి 2 వికెట్లు, దీపక్ చాహల్ 4 ఓవర్లలో 43 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. విల్ జాక్స్ కు 2 ఓవర్లలో 12 పరుగులిచ్చి 1 వికెట్ దక్కింది.

## సూర్యకుమార్ యాదవ్ పోరాటం వృథా..

206 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ తీవ్రంగా పోరాడింది. సూర్యకుమార్ యాదవ్ 42 బంతుల్లో 60 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. హార్దిక్ పాండ్యా కేవలం 15 బంతుల్లో 34 పరుగులు, విల్ జాక్స్ 18 బంతుల్లో 33 పరుగులతో వేగంగా ఆడినా జట్టును గెలిపించలేకపోయారు. జోఫ్రా ఆర్చర్ బౌలింగ్ లో కూడా అదరగొట్టి 4 ఓవర్లలో కేవలం 17 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. బ్రిజేష్ శర్మ 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి 2 వికెట్లు, నాంద్రే బర్గర్ 4 ఓవర్లలో 43 పరుగులిచ్చి 2 వికెట్లు తీశారు. ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 175 పరుగులు మాత్రమే చేయగలిగింది.

## టాప్ 4 జట్లు ఖరారు..

ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ 14 మ్యాచ్ లలో 8 విజయాలతో 16 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకుని తన ప్లే ఆఫ్స్ స్థానాన్ని అధికారికంగా ఖరారు చేసుకుంది. పాయింట్ల పట్టికలో మిగిలిన జట్లు 15 పాయింట్లు అంతకంటే తక్కువగా ఉన్నందున రాజస్థాన్ అర్హత పొందింది. టాప్ 4 జట్లుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (18 పాయింట్లు), గుజరాత్ టైటాన్స్ (18 పాయింట్లు), సన్‌రైజర్స్ హైదరాబాద్ (18 పాయింట్లు), రాజస్థాన్ రాయల్స్ (16 పాయింట్లు) ఖరారైపోయాయి. నెట్ రన్ రేట్ ఆధారంగా బెంగళూరు ఒకటో స్థానంలో, గుజరాత్ రెండో స్థానంలో, హైదరాబాద్ మూడో స్థానంలో, రాజస్థాన్ నాలుగో స్థానంలో ఉన్నాయి.

## ప్లే ఆఫ్స్ షెడ్యూల్

ఐపిఎల్ 2026 ప్లే ఆఫ్స్ షెడ్యూల్ సాధారణ ఐపిఎల్ ప్రకారం మే 26 నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ షెడ్యూల్ తేదీలు, వేదికలు ఊహాజనితమైనవి కానీ ఆకృతి సాధారణ ఐపిఎల్ ప్రకారం ఉంది.

- మే 26 (మంగళవారం) - క్వాలిఫైయర్ 1: ఒకటో స్థానం జట్టు (రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు) వర్సెస్ రెండో స్థానం జట్టు (గుజరాత్ టైటాన్స్). **వేదిక:** అహ్మదాబాద్.
- మే 27 (బుధవారం) - ఎలిమినేటర్: మూడో స్థానం జట్టు (సన్‌రైజర్స్ హైదరాబాద్) ఐం నాలుగో స్థానం జట్టు (రాజస్థాన్ రాయల్స్). **వేదిక:** అహ్మదాబాద్.
- మే 29 (శుక్రవారం) - క్వాలిఫైయర్ 2: క్వాలిఫైయర్-1 లో ఓడిన జట్టు వర్సెస్ ఎలిమినేటర్ విజేత జట్టు. **వేదిక:** చెన్నై.
- మే 31 (ఆదివారం) - ఫైనల్: క్వాలిఫైయర్-1 విజేత జట్టు వర్సెస్ క్వాలిఫైయర్ 2 విజేత జట్టు. **వేదిక:** చెన్నై.






# హల్లల్లల్లోతో ఊపేస్తున్న పెద్ది

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న పెద్ది సినిమా ప్రమోషన్స్ దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ట్రైలర్, తొలి రెండు పాటలు ప్రేక్షకుల్లో అంచనాలను పెంచగా.. తాజాగా విడుదలైన 'హల్లల్లల్లో' పాట సోషల్ మీడియాలో కొత్త సంచలనంగా మారింది. గత రెండు రోజులుగా ప్రోమోతోనే వైరల్ అయిన ఈ గీతం.. పూర్తి వీడియో విడుదలైన వెంటనే యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, షార్ట్ వీడియో వేదికల్లో ట్రెండింగ్‌లోకి దూసుకెళ్లింది. మెగా అభిమానులతో పాటు సంగీత ప్రియులను కూడా ఈ పాట విశేషంగా ఆకట్టుకుంటోంది. "హల్లల్లల్లో... హల్లో హల్లల్లల్లో..." అంటూ సాగే ఈ మాస్ రొమాంటిక్ పాటలో రామ్ చరణ్ ఎనర్జీ, స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందించిన ఈ పాటలో ఆయన రా అండ్ రస్టిక్ లుక్ అభిమానులను ఫిదా చేస్తోంది. ముఖ్యంగా హీరోయిన్ జాన్వీ కపూర్తో రామ్ చరణ్ కెమిస్ట్రీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ఇద్దరి మధ్య కనిపించిన స్క్రీన్ ప్రెజెన్స్ పాటకు మరింత ప్రత్యేకత తీసుకొచ్చిందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పాటకు ప్రముఖ రచయిత అనంత్ శ్రీరామ్ సాహిత్యం అందించగా.. గాయని రక్షిత సురేష్ తన గాత్రంతో ప్రత్యేకమైన ఫీల్‌ను తీసుకొచ్చారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ రూపొందించిన డ్యాన్స్ స్టెప్పులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ వేసిన కొన్ని హుక్ స్టెప్పులు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ ఛాలెంజ్‌లుగా మారాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. 'చికిరి చికిరి', 'రయ్ రయ్ రా రా' పాటలతో పాటు ట్రైలర్‌కు వచ్చిన స్పందన సినిమాపై ఆసక్తిని మరింత పెంచింది. ముఖ్యంగా ఈ సినిమా క్లైమాక్స్ ప్రేక్షకులకు పెద్ద సర్‌ప్రైజ్‌గా నిలుస్తుందని చిత్రబృందం పదే పదే చెబుతుండటం ఆసక్తిని పెంచుతోంది. భావోద్వేగాలు, మాస్ యాక్షన్, గ్రామీణ నేపథ్యం కలిసిన పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. సినిమా ప్రమోషన్స్ విషయంలో కూడా మేకర్స్ భారీ స్థాయిలో ప్రణాళికలు అమలు చేస్తున్నారు. భోపాల్‌లో జరిగిన 'పెద్ది కీ ఆవాజ్' కార్యక్రమానికి అభిమానుల నుంచి అద్భుత స్పందన లభించింది. త్వరలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ నగరాల్లో భారీ ప్రమోషనల్ ఈవెంట్లు నిర్వహించేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. హైదరాబాద్‌లో జరగనున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు నందమూరి బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతారనే వార్తలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, దివ్యేందు శర్మ, బొమన్ ఇరానీ, జగపతిబాబు, సాయికుమార్, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్ ప్రదర్శనలు నిర్వహించనున్నారు.




# ఏడేళ్ల ప్రేమ..

## పెళ్లి తర్వాత జీవితం గురించి అవికా గోర్ ఆసక్తికర వ్యాఖ్యలు

చిన్న వయసులోనే టెలివిజన్ ప్రపంచంలో స్టార్‌డమ్ సంపాదించి, తర్వాత తెలుగు సినీ ప్రేక్షకులకు దగ్గరైన నటి అవికా గోర్ తాజాగా తన వ్యక్తిగత జీవితం, ప్రేమ వివాహం, కెరీర్ ప్రయాణం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల విడుదలైన "అగ్లీ స్టోరీ" సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె, ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలోని ఎన్నో మధుర జ్ఞాపకాలను పంచుకున్నారు. బాలనటిగా "బాలికా వధు" సీరియల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన అవికా.. ఆ పాత్ర తన జీవితాన్నే మార్చేసిందని చెప్పారు. తాను ముంబైలో పెరిగినా, రాజస్థానీ భాష అసలు తెలియదని, అయినప్పటికీ ఆ పాత్ర కోసం ఎంపిక కావడం తన అదృష్టమని తెలిపారు. ఆ సీరియల్ విజయం తన కెరీర్‌కు బలమైన పునాది వేసిందని పేర్కొన్నారు. తర్వాత కేవలం 15 ఏళ్ల వయసులోనే "ఉయ్యాల జంపాల" సినిమాతో తెలుగు తెరకు పరిచయం కావడం పూర్తిగా అనుకోకుండా జరిగిందని అవికా చెప్పారు. అసలు తాను హీరోయిన్ అవుతానని, ముఖ్యంగా తెలుగు సినిమాల్లో నటిస్తానని ఎప్పుడూ ఊహించలేదని తెలిపారు. కానీ వచ్చిన అవకాశాలను నమ్మకంతో స్వీకరించడంతో తన ప్రయాణం అద్భుతంగా సాగిందని చెప్పారు. ఇక తన ప్రేమ వివాహం గురించి మాట్లాడుతూ.. తమ ఇద్దరి పరిచయం దాదాపు ఏడేళ్ల నాటిదని వెల్లడించారు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్న తర్వాతే పెళ్లి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తమ ప్రేమ విషయాన్ని ఇంట్లో చెప్పిన తర్వాత తన తల్లి చాలా తక్కువ సమయంలోనే అంగీకరించారని, కుటుంబ సభ్యుల మద్దతు తమ బంధాన్ని మరింత బలపరిచిందని తెలిపారు. పెళ్లి తర్వాత జీవితం గురించి మాట్లాడిన అవికా.. దాంపత్య జీవితం ఎంతో సంతోషంగా సాగుతోందని చెప్పారు. ఒకరిపై మరొకరికి గౌరవం ఉండటం తమ బంధానికి ప్రధాన బలం అని పేర్కొన్నారు. వ్యక్తిగత ఎదుగుదలకు పరస్పరం మద్దతు ఇస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. సామాజిక మాధ్యమాల ప్రభావం తమ సంబంధంపై అసలు ఉండదని, నిజమైన జీవితాన్ని నిజాయితీగా జీవించడానికే ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. తన భర్త కార్పొరేట్ రంగంలో సీనియర్ ప్రొడక్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారని, ప్రముఖ విద్యాసంస్థలో చదివారని అవికా వెల్లడించారు. ప్రస్తుతం ఆయన బ్యాంకాక్‌లో ఉద్యోగం చేస్తున్నారని, తాను కూడా ఎక్కువ సమయం అక్కడే గడుపుతున్నానని చెప్పారు. అయితే సినిమా షూటింగ్స్ కోసం తరచూ భారత్‌కు వస్తూ ఉంటానని తెలిపారు. తమ కెరీర్లు పూర్తిగా వేర్వేరు అయినప్పటికీ, ఒకరి పనిని మరొకరు గౌరవించుకుంటామని అవికా చెప్పారు. ముఖ్యంగా తన భర్త తనను కేవలం నటిగా కాకుండా, వ్యక్తిగా అర్థం చేసుకుంటారని తెలిపారు. తన వృత్తి వల్ల కాకుండా, తన వ్యక్తిత్వాన్ని ప్రేమించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని చెప్పారు. కెరీర్ విషయానికి వస్తే.. ఏ సినిమా విజయం సాధిస్తుందో, ఏది ఆశించిన ఫలితం ఇవ్వదో ముందుగా చెప్పడం చాలా కష్టమని అవికా అభిప్రాయపడ్డారు. తన జీవితంలో చాలా విషయాలు అనుకోకుండా జరిగాయని, అందుకే భవిష్యత్తు గురించి ఎక్కువగా ఆలోచించడం మానేశానని తెలిపారు. భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే అవకాశంపై కూడా అవికా స్పందించారు. సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వెళ్లిన మహిళలను చూసి తాను కూడా ఆశ్చర్యపోలేదని చెప్పారు. ఒకవేళ అలాంటి అవకాశం వస్తే దాన్ని పూర్తిగా తిరస్కరించనని పేర్కొన్నారు. జీవితంలో ఏం జరుగుతుందో ముందుగా చెప్పలేమని, అందుకే ప్రతి అవకాశాన్ని సానుకూలంగా స్వీకరించాలని భావిస్తున్నానని అవికా గోర్ తెలిపారు.

# బన్నీ సలహా.. ప్రభాస్‌పై కాజల్ ఆసక్తికర వ్యాఖ్యలు



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన సహనటుల గురించి చెప్పిన ఆసక్తికర విషయాలు ఇప్పుడు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా అల్లు అర్జున్ ఇచ్చిన ఓ విలువైన సలహా తన నటనలో ఎంతో మార్పు తీసుకువచ్చిందని, ప్రభాస్‌తో నటించిన అనుభవం చాలా ప్రత్యేకమని కాజల్ చెప్పిన మాటలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సినిమా సెట్లలో అందరితోనూ మంచి అనుబంధం ఉండేదని తెలిపిన కాజల్.. సహనటుల నుంచి వచ్చే సూచనలను తాను ఎప్పుడూ స్వాగతిస్తానని పేర్కొన్నారు. కొన్నిసార్లు వాళ్లు చెప్పిన చిన్న చిన్న విషయాలే నటనలో పెద్ద మార్పు తీసుకువస్తాయని అన్నారు. అలాంటి ఒక ముఖ్యమైన సూచన తనకు అల్లు అర్జున్ నుంచి వచ్చిందని గుర్తు చేసుకున్నారు. తాను సహజంగానే చాలా చురుకైన వ్యక్తినని, దర్శకుడు "కట్" అని చెప్పగానే వెంటనే ఆ సన్నివేశంలోని భావోద్వేగం నుంచి బయటకు వచ్చేసేదాన్నని కాజల్ తెలిపారు. అయితే అల్లు అర్జున్ మాత్రం "కెమెరా పూర్తిగా ఆగే వరకు ఆ భావోద్వేగాన్ని అలాగే కొనసాగించాలి" అని చెప్పారని వెల్లడించారు. అలా చేస్తే ఎడిటింగ్ సమయంలో సన్నివేశం మరింత సహజంగా కనిపిస్తుందని బన్నీ వివరించాడని చెప్పారు. ఆ సలహా తనకు ఎంతో ఉపయోగపడిందని, ఇప్పటికీ అదే పద్ధతిని పాటిస్తున్నానని కాజల్ వెల్లడించారు. ఇక సహనటుల ఎత్తు గురించి మాట్లాడిన కాజల్.. తనతో నటించిన హీరోలు చాలా పొడవుగా ఉండేవారని సరదాగా చెప్పారు. అందుకే తాను సాధారణంగా ఎక్కువ ఎత్తైన హీల్స్ ధరించేదాన్ని కాదని తెలిపారు. ఎక్కువగా ఒకటి లేదా రెండు అంగుళాల హీల్స్ మాత్రమే వేసుకునేదాన్నని పేర్కొన్నారు. అయితే ప్రభాస్‌తో కలిసి నటించిన సమయంలో మాత్రం తనకు మంచి కంఫర్ట్ ఫీలింగ్ ఉండేదని కాజల్ అన్నారు. "డార్లింగ్" సినిమా సమయంలో ప్రభాస్ ఎత్తు కారణంగా తాను నాలుగు నుంచి ఆరు అంగుళాల వరకు ఉన్న హీల్స్ కూడా ధరిచానని చెప్పారు. స్టిలెటోస్ వేసుకుని సౌకర్యంగా నటించగలిగానని గుర్తు చేసుకున్నారు. ప్రభాస్‌తో పని చేయడం చాలా హ్యాపీ అనుభవమని తెలిపారు. గ్లామర్ గురించి కూడా కాజల్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. గ్లామర్ అంటే కేవలం అందాల ప్రదర్శన కాదని, నటనలోని సొగసు కూడా అంతే ముఖ్యమని అన్నారు. చీరలోనైనా, పూర్తి చేతుల దుస్తుల్లోనైనా ఒక నటి ఎంతో ఆకర్షణీయంగా కనిపించవచ్చని చెప్పారు. సొగసుకు, అసభ్యతకు మధ్య చాలా సున్నితమైన గీత ఉంటుందని, తాను ఎప్పుడూ ఆ గీత దాటేలా ప్రవర్తించనని స్పష్టం చేశారు. తన కుటుంబ సభ్యులతో కలిసి చూసేందుకు ఇబ్బంది కలిగించేలా ఎప్పుడూ పాత్రలు చేయనని కూడా కాజల్ పేర్కొన్నారు. నటిగా గ్లామర్ కంటే నటనకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని, అదే తనకు ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం కాజల్ చేసిన ఈ వ్యాఖ్యలు మరోసారి అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com